క్లుప్తంగా

సీపీఐ మహాసభను విజయవంతం చేయాలి

మొయినాబాద్: ఈ నెల 15న నిర్వహించనున్న సీపీఐ మండల 12వ మహాసభను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గురువారం మొయినాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు పోరాటాల కార్యాచరణపై మహాసభలో చర్చిస్తామన్నారు. అదేవిధంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. ఈ సభకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రామస్వామి హాజరవుతారన్నారు. మొయినాబాద్‌లో జరిగే మండల మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



ముట్పూర్‌లో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ముట్పూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు ఇవ్వడంతో పాటు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులందరూ త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, నాయకులు పురుషోత్తం రెడ్డి, శివకుమార్, మల్లేశ్‌గౌడ్, నర్సింలు, అంజయ్య, రవి, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ, పార్కు స్థలాలను కాపాడండి

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో ప్రభుత్వ, భూదాన్ భూములు, పార్కు స్థలాలను కాపాడాలని గ్రామస్తులు తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు విన్నవించారు. పెద్దమంగళారం రెవెన్యూలోని పింకి ఎస్టేట్ వెంచర్‌లో ఉన్న పార్కు స్థలాన్ని కొందరు అక్రమంగా కబ్జా చేస్తున్నారని.. అదే విధంగా ప్రభుత్వ, భూదాన్ భూములను సైతం కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాదారుల చెర నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు.

అనుమతి లేని రిసార్ట్‌ను సీజ్ చేయాలి

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: అనుమతి లేకుండా మండలంలో కొనసాగుతున్న త్రిపుర రిసార్ట్‌ను సీజ్ చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ చంద్రకళకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఈర్లపల్లిలో ఉన్న త్రిపుర రిసార్ట్ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతోందన్నారు. ఈ రిసార్టులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జీఓ 111 పరిధిలో ఈర్లపల్లి గ్రామం ఉందని ఇక్కడ రిసార్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఇలాంటి రిసార్టులపై ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అనుమతులు లేని వాటిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, చందు, తదితరులు ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

మొయినాబాద్‌రూరల్: చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని టీచర్ అరుణ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లిలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని అరుణ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలన్నారు. చిన్నారులకు ఆటాపాటలతో విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చందన, ఉపాధ్యాయులు నర్సింహ, రాములు, పద్మ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

మొయినాబాద్: మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోషకాహారం అందించే విధానం, కిచెన్ గార్డెన్ అభివృద్ధి, పిల్లలకు ఆటాపాటలతో విద్యాభ్యాసం, బొమ్మల పుస్తకాలు, ప్రీస్కూల్ కిట్స్‌లో ఉండే వస్తువులపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనసూయ, భవిష్యవాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట

- మొదటిరోజు హాజరు అంతంతే..
- విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ

సాక్షి పరిశీలన

మొయినాబాద్: వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభమైన పాఠశాలలకు మొదటి రోజు విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొయినాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం 'సాక్షి' విజిట్ నిర్వహించింది. మొయినాబాద్ పాఠశాలలో 230 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. మొదటిరోజు కేవలం 7 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఉపాధ్యాయులు మాత్రం 9 మందికిగాను అందరూ పాఠశాలకు వచ్చారు. విద్యార్థులు ఎక్కువ మంది రాకపోవడంతో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేయలేదు. అదే విధంగా చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా సరఫరా చేసిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించారు.



మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హాజరైన విద్యార్థులు

కొన్ని తరగతులు ఖాళీగా..

చేవెళ్ల: పాఠశాలలు పునఃప్రారంభం కావటంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కనిపించారు.. కానీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. కొన్ని తరగతుల్లో విద్యార్థులే లేక ఖాళీగా ఉపాధ్యాయులు ఒక్కరే ఉన్న పరిస్థితి ఉంది. పదుల సంఖ్యలో కూడా విద్యార్థులు మొదటిరోజు హాజరు కాలేదు. మండలంలో పలు పాఠశాలల్లో మొదటిరోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. చేవెళ్లలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు.



చేవెళ్ల పాఠశాలలో విద్యార్థులు లేకపోవటంతో ఒక్కడే కూర్చున్న ఉపాధ్యాయుడు

పచ్చని తోరణాలతో స్వాగతం



కొత్తూరు: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ అంగూర్‌నాయక్

కొత్తూరు: వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలల ప్రారంభమైన సందర్భంగా మామిడి ఆకులు, పూలతో తోరణాలు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ, మండలంలో 26 ప్రాథమిక, 03 ప్రాథమికోన్నత, 05 జెడ్పీహెచ్‌ఎస్, 01 కేజీబీవీ, 01 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. అన్ని పాఠశాలల్లో 2,800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా మొదటిరోజు అన్ని పాఠశాలల్లో 50 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలల ప్రారంభం రోజే ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ ఏడాది మొదటి రోజే ప్రతీ విద్యార్థికి యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ అంగూర్‌నాయక్ తెలిపారు.

80 మందికి ఇద్దరు మాత్రమే

షాబాద్: పాఠశాలల పునఃప్రారంభమైన మొదటిరోజు విద్యార్థులు కొంతమంది మాత్రమే హాజరయ్యారు. మండల పరిధిలోని నాగర్‌గూడ, వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలు, షాబాద్ బాలికల ఉన్నత పాఠశాలను సాక్షి గురువారం విజిట్ చేసింది. నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులు ఉన్నారు. మొదటిరోజు 7మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి ఉపాధ్యాయులు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం వండిపెట్టారు. మొదటిరోజు కొత్తగా 5 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు హెచ్‌ఎం కృష్ణ తెలిపారు. అదేవిధంగా వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులకు తొలిరోజు 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. షాబాద్ బాలికల పాఠశాలలో 80 మందికి ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. వారికి పుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించారు. ఒక రోజు ముందే పాఠశాలలను శుభ్రం చేయించి పరిశుభ్రంగా ఉంచారు.



షాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో హాజరైన విద్యార్థులు

సమస్యలతో స్వాగతం

- పలు పాఠశాలల్లో గేటు ఎదుట, ఆవరణలో నిలిచిన వర్షపునీరు
- ఇబ్బందిపడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేవెళ్ల: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు ప్రారంభించిన మొదటిరోజు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యలే స్వాగతం పలికాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేట్ ముందే వర్షపునీరు నిలిచి చెరువును తలపించేలా దర్శనమిచ్చింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎలా లోపలికి వెళ్లాలో అర్థంకాక నీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సైతం వర్షానికి ఆవరణలో నీళ్లు నిలిచాయి. వేసవి సెలవుల్లోనే సమస్యలను పరిష్కరించి పాఠశాలలకు స్వాగతం పలుకాల్సింది పోయి అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు మండిపడుతున్నారు.



చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని వినతి

షాద్‌నగర్: పట్టణంలోని మినీ స్టేడియం వద్ద ఉన్న శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని గురువారం వివిధ సంఘాల నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, మార్వాడి మంచ్ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక ప్రహరీ పూర్తిగా శిథిలావస్థకు చేరి కొంత భాగం కూలిపోయిందని పేర్కొన్నారు. అదేవిధంగా మరిన్నీ వసతులు కల్పించాలని కోరారు. ప్రహరీ నిర్మించేందుకు చర్యలు చేపడుతామని వారికి హామీనిచ్చారు.

టీబీ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్: టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారంలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీబీ అనేది మైకో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే సూక్ష్మ క్రిమితో వ్యాపిస్తుందని, వ్యాధి ఉన్నవారు దగ్గిన, తుమ్మినా గాలిలో వ్యాప్తి చెంది ఇతరులకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము ఉండటం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి ఉంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల్లో టీబీ ఉందని తేలితే ప్రభుత్వమే వారికి రూ.8వేలు విలువైన మందులను ఉచితంగా అందజేస్తుందన్నారు. ఆరునెలలు పాటు మందులు తీసుకుంటే టీబీ పూర్తిగా నయం అవుతుందన్నారు. టీబీ ఉన్నవారు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘువేందర్, డాక్టర్ శ్రీలలిత, సిబ్బంది మహేశ్వరీ, శ్రావణ్ కుమార్, అమృత, షఫీ, రవికుమార్, వెంకటముని, శ్యాంసుందర్, మల్లేశ్, రెడ్యా నాయక్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

చుక్కమెట్టు బడి తెరుచుకునేనా?

- దళితులపై సర్కారుకు కనికరం లేదా అంటూ తల్లిదండ్రుల ఆవేదన
- పాఠశాల తెరిపించాలని అధికారులకు వినతి

కొందుర్గు: ప్రభుత్వం మూతబడిన పాఠశాలలన్నీ తెరిపించాలని, పేదలందరికీ నాణ్యమైన విద్యనందించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా మండలంలోని చుక్కమెట్టులో గల ప్రభుత్వ పాఠశాల తెరుచుకోవడం లేదు. ఈ గ్రామంలో దాదాపు 50 కుటుంబాలు ఉంటాయి. అన్ని దళిత కుటుంబాలే. అయితే ప్రభుత్వం 20 ఏళ్ల క్రితమే ఇక్కడ పాఠశాలను ప్రారంభించింది. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం కూడా ప్రారంభించింది. కానీ మూన్నాళ్ల ముచ్చటగా అంగన్‌వాడీ కేంద్రాన్ని చుక్కమెట్టు నుంచి ముట్పూర్‌కు మార్చారు. పాఠశాలను మూతవేశారు. పాఠశాల మూసివేయడంతో ప్రతి రోజు 5 కిలోమీటర్లు ఉన్న ముట్పూర్‌కు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. తమ గ్రామంలో పాఠశాలను మూతవేయడం ఏమిటని, అధికారులకు దళితులపై కనికరం లేదా అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పాఠశాలను తెరిపించాలని కోరుతున్నారు.



మూతబడిన చుక్కమెట్టు పాఠశాల

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



మొయినాబాద్‌రూరల్: అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 150 అర్జీలు అందాయని డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిలుకూరులో 57 దరఖాస్తులు

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 57 మంది రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్‌ఐ రోజ, నాయకులు జయవంత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం



అజీజ్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో నిలిచిన ట్రాఫిక్



సురంగల్‌లో బైపాస్ వద్ద బురదమయంగా మారిన మట్టిరోడ్డు

మొయినాబాద్: మొయినాబాద్‌లో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మున్సిపాలిటీతో పాటు అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, సురంగల్, ముర్తుజగూడ, పెద్దమంగళారం, అప్పోజీగూడ ప్రాంతాల్లో అధిక వర్షం కురిసింది. ఈ వర్షానికి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తాలో వరద నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సురంగల్ రోడ్డులో బైపాస్ వద్ద మట్టి రోడ్డు బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కార్పొరేట్ స్థాయిలో ఆదర్శ పాఠశాల

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: కార్పొరేట్ స్థాయిలో చేవెళ్లలోని ఆదర్శ పాఠశాల, కళాశాల అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో గురువారం అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులను ఆ సంస్థ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ సేవలను గ్రామీణ స్థాయి వరకు విస్తరించి అభివృద్ధి చేయాలన్నారు. చేవెళ్లలోని ఆదర్శ పాఠశాలలో దాదాపు కోటి రూపాయలకుపైగా ఖర్చు చేసి పాఠశాల, కళాశాలలకు కావాల్సిన సౌకర్యాలను గుర్తించి ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనురాగ్ ఖిల్నాని, విక్రమ్‌శ్రీధరన్, శంకర్‌శ్రీరామ్, పార్థసారధి, మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఎంఈఓ పురన్‌దాస్, ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, మాజీ వైస్‌ఎంపీపీ శివప్రసాద్, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.



డైనింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, సంస్థ సభ్యులు


బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

షాద్‌నగర్‌రూరల్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మాజీ సర్పంచ్ దీనా శంకర్‌యాదవ్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభోత్సవం సందర్భంగా గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ సర్పంచ్ హాజరై మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అపర్ణ,శారద, తేజశ్రీ, గ్రామస్తులు నందరాజ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని పద్మావతీ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యనందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో పట్టణంలో ప్రభుత్వ కళాశాలను నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, హెచ్‌ఎం భాగ్యమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

కొందుర్గు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటిరోజు మండలంలోని వివిధ పాఠశాలల్లో, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశాడు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి షెకీనా నిస్సీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, నరేందర్, మల్లేశ్‌గౌడ్, జహంగీర్, గోవర్ధన్‌గౌడ్, రోహిత్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ బాబుగిరి, ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో వారు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గోవింద్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శారద, హెచ్‌ఎం అనంత, ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

హైతాబాద్ ఉన్నత పాఠశాలలో..

మండల పరిధిలోని హైతాబాద్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు ఖాజామీయా, జనార్దన్‌రెడ్డి, నాయకులు మల్లయ్యగౌడ్, సత్తయ్య, రవి, విద్యాకమిటీ చైర్మన్ రజియాబేగం, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తోల్‌కట్ట, అమ్డాపూర్ పాఠశాలల్లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోల్‌కట్ట పాఠశాలలో గురువారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య చేతులమీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు వడ్ల నర్సింహాచారి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో..

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, మండల విద్యాధికారి మల్లయ్య, హెచ్‌ఎం నర్సింలు చేతులమీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మల్లయ్య చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొందుర్గు: ముట్పూర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న నాయకులు



షాబాద్: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న నోడల్ ఆఫీసర్ బాబుగిరి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



మొయినాబాద్‌రూరల్: విద్యార్థులతో ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు



మొయినాబాద్: విద్యార్థులతో కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, ఎంఈఓ మల్లయ్య